మూగజీవాలకు వరద ముప్పు

- పశువుల సంరక్షణ ఎంతో కీలకం
- పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న అధికారులు
- ఆహారంలోనూ జాగ్రత్తలు తప్పనిసరి




కేదారిలంక వరదనీటిలో పశువులు (ఫైల్), అద్దంకివారిలంకలో పంటుపై పశువులను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రైతులు (ఫైల్)

కపిలేశ్వరపురం: వర్షాకాలం వచ్చిందంటే చాలు వరదలకు సైతం లంక గ్రామాల ప్రజలు మానసికంగా సిద్ధమవుతారు. వరదలకు లంక గ్రామాల్లోని ప్రజలతో పాటు వ్యవసాయ క్షేత్రాల్లోని పాడి పంటలు సైతం ప్రభావితమవుతాయి. వరద సమయంలో లంక గ్రామాల్లోని పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, తదితర జీవాల సంరక్షణ సైతం అత్యవసరమే. వరదల సమయంలో పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశు వైద్యుడు ఎన్వీ రమణమూర్తి వివరించారు.

లంక గ్రామాల పరిస్థితి ఇలా..

రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంవరం మండలం శేరిలంక, మండపేట నియోజకవర్గంలోని కపిలేశ్వరపురం మండలం కేదారిలంక పంచాయతీ పరిధిలో శేరిగూడెం, వీధివారిలంక, కపిలేశ్వరపురం, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లపులంక, కోరుమిల్లిలంక గ్రామాలు దాదాపు గోదావరి నదిలో ఉన్నాయి. ఇవే కాకుండా కె.గంగవరం మండలంలోని కూళ్ల, మల్లవరం, సుందరపల్లి, కోటిపల్లి, కపిలేశ్వరపురం మండలం తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వాకతిప్ప గ్రామాలు గోదావరి తీరాన ఉన్నాయి. వరదల సమయంలో ఆయా ప్రాంతాల్లోని పశువులను వ్యవసాయ క్షేత్రాల నుంచి నివాస ప్రాంతాలకు తరలిస్తుంటారు. 2025లో ఇప్పటి వరకూ రెండు సార్లు వరద వచ్చింది. ఇటీవల గోదావరి నది ఉప్పొంగి తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం రెండో సారి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతానికి వరద నీరు వ్యవసాయ క్షేత్రాలను తాకలేదు. మరింత నీటిమట్టం పెరిగితే పాడి పశువులను వ్యవసాయ క్షేత్రాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వస్తుంది.

నియోజకవర్గంలో పశువుల వివరాలు

రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం మండలంలో 2,159 ఆవులు, 7,288 గేదెలు, కె.గంగవరం మండలంలో 4,289 ఆవులు, 8,846 గేదెలు, కాజులూరు మండలంలో 4,830 ఆవులు, 8,332 గేదెలు ఉన్నాయి. నదీ తీర ప్రాంతం అధికంగా ఉన్న మండపేట నియోజకవర్గంలో 28,975 గేదెలు, 5,723 ఆవులు, 3,451 గొర్రెలు, 2,942 మేకలు ఉన్నాయి. వీటిలో అధిక శాతం పశువులను లంక పొలాల్లో సంరక్షిస్తుంటారు.

వాతావరణ మార్పుల ప్రభావంతో..

వరదల సమయంలో సూర్యరశ్మి తక్కువగా ఉండటం, రోజుల తరబడి చల్లని గాలి ఉండటం, తడి నేలతో చెమ్మగా ఉండటం, ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు ప్రవాహంలో మృత కళేబరాలు కొట్టుకురావడం తదితర కారణాలు పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి.

వరద వీడిన తర్వాత ఇలా...

వరద నీరు వీడిన వెంటనే పశువు కాళ్లు, గిట్టలను క్షుణ్ణంగా పరిశీలించాలి. నడిచే స్థితిని బట్టి ఆరోగ్య స్థాయిని అంచనా వేయొచ్చు. వరద పరిస్థితి చక్కబడిన వెంటనే పెద్దమొత్తంలో ఆహారాన్ని అందించకుండా క్రమ క్రమంగా ఆహార పరిమాణాన్ని పెంచుతూ ఉండాలి. ధాన్యం, పిండి వంటి పదార్థాలను నేరుగా పెట్టరాదు. బురద లేని చోట పశువులను కట్టుకోవాలి. పాలను క్రమం తప్పకుండా తీస్తుండాలి. పశువులకు పాదుగువాపు ఉంటే వైద్యం చేయించాలి.

జాగ్రత్తలు పాటించాలి



వరద పరిస్థితుల్లో పశువులు దొమ్మ, జబ్బవాపు, ఆంత్రాక్స్‌వంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వరదకు దెబ్బతిన్న పచ్చిక బయళ్లలోని గడ్డి, బూజుపట్టిన ఎండు గడ్డి తినకుండా చూడాలి. కలుషిత నీటిని తాగడం వల్ల జీర్ణకోశ వ్యాధులు వ్యాపిస్తాయి. నీటిలో ఉండటం వల్ల వాటి గిట్టలు, కాళ్లకు వ్యాధులు వస్తాయి. నీటి కుంటలు, దోమలు, కీటకాలు దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తాయి. వ్యాధుల బారిన పడితే పాల దిగుబడి తగ్గడంతో పాటు పొదుగు వాపు వ్యాధి కూడా వస్తుంది. 105 డిగ్రీల జ్వరం, ఊపిరి ఆడక ఇబ్బంది పడటం వంటి లక్షణాల ద్వారా గొంతు వాపు వ్యాధిని గుర్తించవచ్చు. సకాలంలో స్పందించకపోతే గొంతు పూడుకుపోయి గాలి ఆడక పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. సాధారణంగా టీకా వేసిన ఆరు నెలలు వరకూ మందు పని చేస్తుంది. వరద పరిస్థితి తీవ్రంగా ఉంటే ఆరు నెలలు లోపే మరో డోసు వేసినా ఇబ్బంది ఉండదు.

ఎన్వీ రమణమూర్తి, పశువైద్యాధికారి

క్లుప్తంగా

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

రామచంద్రపురం ఆర్డీఓ అఖిల



అంగర పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ అఖిల

కపిలేశ్వరపురం: ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల ఆదేశించారు. మండలంలోని అంగర పీహెచ్‌సీని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పనితీరును వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి వివరించారు. ల్యాబ్, ఓపీ, ఫార్మసీ విభాగాల్లో రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలు ఆర్డీఓ అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. ఐవీఆర్ఎస్‌లో అన్ని విభాగాల నుంచి రోగుల ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీహెచ్ఎస్ జిత్తుక మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్‌లు తాతపూడి మేరీమణి, యం.నానిబాబు, వీఆర్వో సీతామహాలక్ష్మి ఉన్నారు.

డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: మండలంలోని సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణ, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, శక్తి యాప్ తదితర విషయాలపై రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే శక్తి యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి మహిళా పోలీస్ స్కూల్‌కు వస్తారని, ఆ సమయంలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఏఎస్సై రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల హెచ్‌ఎంకు సత్కారం



వల్లూరు పాఠశాలలో హెచ్‌ఎం మాణిక్యాంబను సత్కరిస్తున్న ఎంఈఓలు

కపిలేశ్వరపురం: ఉపాధ్యాయుల సేవలు సమాజ ఉన్నతికి దోహదపడతాయని మండపేట ఎంఈఓలు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి అన్నారు. కపిలేశ్వరపురం మండలం వల్లూరు ఎంపీపీ ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ముత్యాల మాణిక్యాంబ గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఆ సందర్భంగా వల్లూరు పాఠశాలలో ఆమెను అధికారులు, సహచర ఉపాధ్యాయులు సత్కరించారు. తన విధి నిర్వహణకు సహకరించిన వారికి హెచ్‌ఎం మాణిక్యాంబ కృతజ్ఞతలు తెలిపారు.

సొంత నిధులలో పాఠశాల సుందరీకరణ



వెలగతోడులో పాఠశాల భవనం సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం వెలగతోడు జెడ్పీ ఉన్నత పాఠశాలను సుందరీకరిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలన్నది ఆ పాఠశాల హెచ్‌ఎం కౌంటేని శ్రీనివాసరావు తపన. తాను పనిచేస్తున్న పాఠశాల భవనం రంగులు వెలిసిపోయి ఉండటాన్ని సహించలేకపోయారు. సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలను సుందరీకరించాలనే తపనతో సొంత నిధులు రూ.లక్షకు పైగా వెచ్చించి పాఠశాలకు రంగులు వేయిస్తున్నారు. సిమెంట్ మెట్లు ఏర్పాటు చేస్తున్నారు. మంచినీటి సదుపాయాన్ని మెరుగుపర్చుతున్నారు. పగిలిన గచ్చులకు మరమ్మతులు చేయిస్తున్నారు. ఆయనే స్వయంగా దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. పాఠశాల సుందరీకరణకు కృషి చేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావును పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందిస్తున్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



మండపేట జూనియర్ కళాశాల మైదానంలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

కపిలేశ్వరపురం (మండపేట): జాతీయ డెంగీ నివారణ మాసోత్సవాల ముగింపును పురస్కరించుకుని గురువారం మండపేట పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మెప్మా ఆర్పీలు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు ర్యాలీ చేశారు. పట్టణంలోని పలు వీధుల మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకూ ర్యాలీ చేసి కళాశాల మైదానంలో మానవహారంగా ఏర్పడ్డారు. డెంగీ నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కౌన్సిలర్లు మలసాని సీతామహాలక్ష్మి, గ్రంధి శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి. దీనదయాళ్ బిషప్, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు మాట్లాడుతూ అవగాహనతోనే డెంగీ నివారణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ కె.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు, రెవెన్యూ అధికారి జేవీఎస్ శాస్త్రి, అసిస్టెంట్ ఇంజినీర్లు డి.పవన్‌కుమార్, అనూష లక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. కాలేరు, వల్లూరు ఫీడర్‌ల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా వెదురుమూడి, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట, వల్లూరు గ్రామాల్లోని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకూ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాయవరం: మండలంలో పసలపూడి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పసలపూడి రూరల్ ఫీడర్, పసలపూడి, చెల్లూరు, మాచవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కాజులూరు: గొల్లపాలెం 33/11కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈఎస్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. గురువారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ వీర్రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. గొల్లపాలెం 11కేవీ ఇండ్రస్టీయల్ ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, మొగలిపాలెం, బందనపూడి, శలపాక, మంజేరు, టి మామిడాడ, పెనుమళ్ల, అండ్రంగి, జగన్నాథగిరి, కరప మండలంలోని కొంగోడు, పెద్దాపురపాడు, విజయరాయుడుపాలెం, యండమూరు, గొర్రిపూడి, కాజులూరు 11కేవీ ఇండ్రస్ట్రీయల్ ఫీడర్ పరిదిలోని అయితపూడి, శీల, ఒంటితాడి, తిప్పరాజుపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. పై గ్రామాల్లో గృహ వాసాలతో పాటు విద్యుత్ లైన్‌ల్లోని ఇండ్రస్టీయల్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

రామచంద్రపురం: ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని, అధికారులు ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. గురువారం రామచంద్రపురంలోని 1వ వార్డులో ఉన్న టిడ్కో గృహ సముదాయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. టిట్కో గృహాల్లో ఉన్న సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించబోమన్నారు. అంతిమంగా ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ధ్యేయంతో అన్ని శాఖల అధికారులు పని చేయాలన్నారు. తాగునీరు కోసం వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి చేసి త్వరగా మంచినీరు అందించాలన్నారు. గృహ సముదాయాల్లో పారిశుద్య పనులు, స్లాబ్ లీకేజీ పనులు, వాటర్ పైప్‌లైన్లు తక్షణమే సరిచేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది కొరత ఉంటే తాత్కాలిక పద్ధతిలో నియమించుకునే అవకాశం చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్‌రాజు, డీఈ శ్రీకాంత్, టిడ్కో ఎస్ఈ శేషగిరి, టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన పంటలు పండించాలి



వెలంపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభించి, ఆరోగ్యకరమైన పంటలు పండించాలని రామచంద్రపురం ఏడీఏ నాగకుమార్ సూచించారు. మండలంలోని వెలంపాలెంలో డీఆర్‌సీ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ, రైతులు పండించే పంటల్లో అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల భూమిలో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నాశనం అవుతాయన్నారు. అదే ఆహారం మనుషులు తినడంతో అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. రాబోయే తరాలకు మంచి ఆహారం అందించాలంటే రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాల వైపు అడుగులు వేయాలన్నారు. డీఆర్సీ ఏడీఏలు రాజశేఖర్, నందకిశోర్‌లు చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఏఓ మనోహర్ మాట్లాడుతూ, నానో యూరియా నానో డీఏపీ పిచికారీలతో తక్కువ ఖర్చుతో ఎక్కువ వృథా కాకుండా మొక్కలకు నేరుగా పోషణ అందుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ మాట్లాడుతూ, వ్యవసాయ నిపుణులు అందించిన సూచనలు పాటిస్తూ తక్కువ ఖర్చులో ఎక్కువ నాణ్యమైన ఆహార ఉత్పత్తులు పండించడానికి రైతులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎ.ప్రవీణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

అధికం.. అనర్థం!

- రసాయనిక మందుల పిచికారీలో జాగ్రత్తలు అవసరం
- పెరిగిన వినియోగం
- ఎక్కువ వినియోగిస్తే తీవ్ర నష్టం



మొసలపల్లిలో పంటకు పిచికారీ చేస్తున్న రైతులు (ఫైల్)

అంబాజీపేట: ఆధునిక టెక్నాలజీ పెరుగుతున్నా.. వ్యవసాయం మాత్రం వ్యయసాయంగా మారింది. రైతులు సరికొత్త పద్ధతుల్లో పంటల సాగు చేయడంతో రసాయనిక పురుగు మందుల వినియోగం కూడా రోజురోజుకూ పెరిగిపోతోంది. విత్తనాలు చల్లడం నుంచి పంట కోతకు వచ్చే వరకు పురుగుమందుల వాడకంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి. లేని పక్షంలో పంట దిగుబడి దెబ్బతినడంతోపాటు రైతు నష్టాల బారిన పడాల్సి వస్తుంది. అధికంగా పురుగు మందులు వినియోగిస్తే ప్రమాదమని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మంచి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటపై ప్రభావం పడుతుందని, తప్పకుండా వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని చెబుతున్నారు. 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో పంటలకు పిచికారీ చేయాలి. రైతులు పలు జాగ్రత్తలు తీసుకొని పిచికారీ చేస్తే ప్రమాదాల నుంచి గట్టెక్కవచ్చని ఇటు వైద్యులు, అటు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయకూడదు. తెగుల మందు, పురుగుమందు కలిపి పిచికారీ చేయరాదు. చేతులకు గ్లౌజులు, నోరు, ముక్కుకి మాస్కులు వేసుకోవాలి. మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోరు, చేతులతో రుద్దుకోకూడదు. వాడిన పురుగు మందుల డబ్బాలు ఎక్కడపడితే అక్కడ వేయకూడదు. రసాయన మందుల పిచికారీ సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ లేకుండా చూసుకోవాలి. ద్రావణం కలిపే మందు డబ్బాపై సూచించిన విధంగా, వ్యవసాయ అధికారులు సూచించినట్లుగానీ పిచికారీ చేయాలి. పిచికారీ చేసే సమయంలో బీడీలు, సిగరెట్లు తాగరాదు. భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. రసాయన మందు పిచికారీ చేసే సమయంలో కడుపుమంట, దద్దుర్లు వస్తే సమీపంలో ఉన్న వైద్యుడిని సంప్రదించాలి.

నియోజకవర్గాలు	ఎకరాల్లో వరి సాగు
పి.గన్నవరం	25,382
కొత్తపేట	34,702
రాజోలు	8,650

మోతాదుకు మించి వాడకూడదు



వ్యవసాయ సిబ్బంది సూచించిన మేరకు తగిన మోతాదులో పంటకు ఉదయం వేళల్లో పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపుమందు కొట్టిన తరువాత పురుగు మందు కొట్టకూడదు. మొక్కల పై భాగంతోపాటు కిందభాగం తడిసిపోయేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చే పురుగులు నశిస్తాయి.

– కె.ధర్మప్రసాద్, మండల వ్యవసాయాధికారి, అంబాజీపేట.

కొబ్బరి పంటను కాపాడాలి

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: సముద్ర తీర గ్రామాల్లో కొబ్బరి పంటను కాపాడాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పునీటి ప్రభావానికి వేలాది ఎకరాల్లో కొబ్బరి తోటలు దెబ్బతిన్నాయన్నారు. దీనికి కారణాలు అన్వేశించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే భవిష్యత్‌లో ఇక్కడ వలసలు తప్పవన్నారు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి కూడా అధ్వాన్నంగా ఉందన్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు.

జూలై నెలలో చింతలపల్లి– లక్కవరం రోడ్డు వేస్తామని అధికార పార్టీ నేతలు చెప్పిన హామీ నెరవేరలేదన్నారు. అలాగే డ్రైన్ సక్రమంగా లేక మురుగునీటి పారుదల దెబ్బతిందన్నారు. నియోజకవర్గ పార్టీ యూత్ విభాగం అధ్యక్షుడు గుర్రం జాషువా మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందన్నారు. వర్షాకాలం వచ్చినా బ్లీచింగ్ చల్లలేదని, దోమలు విలయ తాండవం చేస్తున్నాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కూనపరెడ్డి రాంబాబు, చింత రాజబాబు, అడబాల జానకిరామ్, రోకం సందీప్, కొల్లాబత్తుల రాజ్‌కాటన్, గొల్లమందల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలసిన అరవరాజు



మాజీ సీఎం జగన్‌తో అరవరాజు

కపిలేశ్వరపురం (మండపేట): మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ మండపేట రూరల్ మండలం పాలతోడు కమిటీ అధ్యక్షుడు పిల్లా అరవరాజు మర్యాదపూర్వకంగా కలిసారు. తాడేపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం రాత్రి జగన్‌ను కలిశారు.

అక్రమ అరెస్టులు ఆపకపోతే మూల్యం తప్పదు



మాత నూకరావు

కాజులూరు: కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులను ఆపకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మాత నూకరావు అన్నారు. గురువారం దుగ్గుదుర్రులో ఆయన మాట్లాడుతూ, ఎంపీ మిథున్‌రెడ్డి తదితర నేతలను అక్రమంగా అరెస్టు చేయటం ప్రతిపక్షం గొంతునొక్కాలని చేసే ప్రయత్నంలో భాగమేనని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నేతలను సంబంధం లేని కేసుల్లో ఇరికించి అరెస్టు చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మద్యాన్ని నియంత్రించి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటే.. ప్రస్తుతం మద్యం కుంభకోణం పేరుతో నేతలను అరెస్టు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో బెల్టు షాపులు పెరిగిపోయాయని, గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మద్యం తాగమని ప్రోత్సహించి, మరో పక్క పోలీసులతో దాడులు చేయించి అరెస్టులు చేస్తుందన్నారు. పెగ్గ తాగించి పైసలు వసూలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వెదురుమూడిలో సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కపిలేశ్వరపురం: వెదురుమూడి మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు బెల్లం సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను గురువారం పార్టీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గుణ్ణం భాను ప్రసాద్, మండల పరిషత్ విప్ పలివెల మధు, నాయకులు చోడే సూరిబాబు, నానిబాబు, గుత్తుల పుష్పాలరావు, మేడిశెట్టి దుర్గారావు, రామకృష్ణ, పాలింగి శ్రీను పరామర్శించారు. అలాగే మాతృ వియోగంతో బాధపడుతున్న పల్లపులంకకు చెందిన పార్టీ నాయకుడు సిద్ధాంతుల దొరబాబు కటుంబ సభ్యులను మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం, నాయకులు కొత్తపల్లి సూర్యారావు, కొండేటి వెంకన్న, సంగాడి బుజ్జి, వెంకటేశ్వరరవు, ఏసు పరామర్శించారు.

ఫిల్టర్ ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

అంబాజీపేట: జాతీయ విద్యాపథక దినోత్సవం -2025 సదస్సులో మరోసారి గుర్తింపు లభించిన కార్బన్ డై ఆక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్ట్ పేటెంట్ పొందేందుకు సహకారం అందించనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారని తొండవరం హైస్కూల్ హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు తెలిపారు. ఈ మేరకు పాఠశాల సైన్స్ టీచర్ కందాల గణేష్ నరసింహారావుతో కలసి విద్యార్థులు ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న గలగోటి విశ్వవిద్యాలయంలో గత నెల 28 నుంచి 31 వరకు కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రాజెక్ట్ ప్రజెంటేషన్, వర్క్‌షాప్ జరిగింది. ఇన్నోవేటివ్ సెల్ ఏఐసీటీయూ ద్వారా జాతీయ స్థాయికి ఎంపికైన 39 ప్రాజెక్టుల్లో తమ హైస్కూల్ నుంచి పాల్గొని ప్రదర్శించిన కార్బన్ డై ఆక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్టుకు మరోసారి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. విజయం సాధించిన విద్యార్థులకు ప్రత్యేక ఇన్నోవేషన్ కోటాలో భాగంగా ప్రాధాన్యత ఇస్తారని ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారన్నారు. తమ పాఠశాల జాతీయ స్థాయి సదస్సుకు పాల్గొనడంలో కృషి చేసిన జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, డీఈఓ సలీంభాషా, డీఎస్ఓ, ఎంఈఓలకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

విలీన ప్రయత్నం అభినందనీయం



మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్లను అభినందిస్తున్న జేఏసీ నాయకులు

కపిలేశ్వరపురం: మండపేట పట్టణాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని మండపేట పట్టణంలోని జేఏసీ సభ్యులు అభినందించారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ధూళి జయరాజు, కోన సత్యనారాయణ, మందపల్లి దొరబాబు, మద్దుల సుబ్బారావు, మల్లువలస గణపతి, సల్మాన్ హుస్సేన్ తదితరులు మాట్లాడుతూ విలీనానికి అందరూ సహకరించాలని కోరారు.